క్లుప్తంగా

వెటర్నరీ యూనివర్సిటీ పాలక మండలి సభ్యురాలిగా కత్తిరేణమ్మ



ఫిరంగిపురం: శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ పాలకమండలి సభ్యురాలిగా జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి కత్తిరేణమ్మ నియమితులయ్యారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తనను సభ్యురాలిగా ఎంపిక చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కత్తిరేణమ్మకు పలువురు నాయకులు అభినందనలు తెలిపారు.

జగనన్న ఆరోగ్యసురక్ష పేదవారికి వరం



ఫిరంగిపురం: జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా పేదవారికి ఆరోగ్యం చేకూరుతుందని తహసీల్దార్ పద్మనాభుడు, ఎంపీడీఓ అనూరాధలు అన్నారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద శుక్రవారం నుదురుపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష కరపత్రాలు విడుదల చేశారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఈ పథకం ద్వారా ప్రతి పేదవారికి పైసా ఖర్చు లేకుండా ఆరోగ్యం చేకూరేలా సిబ్బంది కృషి చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం జగనన్న ఆరోగ్య సురక్ష కరపత్రాలు విడుదల చేశారు. కార్యక్రమంలో ఎంఎల్ హెచ్‌పీ జ్యోతి, ఏఎన్ఎం రోజమ్మ, ఆశాకార్యకర్తలు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

విద్యార్థులకు గణిత మెటీరియల్ అందజేత

తాడేపల్లిరూరల్: నగర పాలక సంస్థ పరిధిలోని వడ్డేశ్వరం ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు గణిత మెటీరియల్‌ను శుక్రవారం అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుబ్బారావు మాట్లాడుతూ ఉపాధ్యాయులు కాకుమాను జోజప్ప సహకారంతో పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న 120 మంది విద్యార్థులు రూ. 6 వేల విలువగల గణిత స్టడీ మెటీరియల్ అందజేశామని, విద్యార్థులు అభ్యసించి నూరు శాతం ఫలితాలు సాధిస్తారని ఆకాంక్షిస్తున్నామన్నారు. అనంతరం పాఠశాలలో పనిచేస్తున్న ఆయాలకు చీరలు పంపిణీచేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు కె.జోజప్ప, పి.బుజ్జిబాబు, డి.వి.రమణమ్మ, ఎం. సుందరరాజు, శ్రీరామచంద్రారెడ్డి, పి.సుజాత, ఎం.రమాదేవి, ఎం. రామచంద్రారెడ్డి, డి.శ్రీనివాసరావు, టి.శ్రీనివాసరావు, ఎం.రామచంద్రరావు, పి. వసంతరావు తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

మంగళగిరి: కార్పొరేషన్ పరిధిలోని యర్రబాలెం శ్రీనగర్ కాలనీలో ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. మంగళగిరి రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు యర్రబాలెం శ్రీనగర్‌కాలనీకి చెందిన వేదాంతం శ్రీమన్నారాయణ కుమారుడు విష్ణు ప్రవీణ్ (50) నగరంలోని ఓ దేవాలయంలో అర్చకునిగా పనిచేస్తున్నారు. కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లో ఉంటున్నారు. ఆయన ఒంటరిగా నివసిస్తున్నాడు. విష్ణు ప్రవీణ్ అవివాహితుడు కావడంతో అదే ప్రాంతానికి చెందిన మేనత్త శ్రీ భాష్యం లక్ష్మీ జయప్రద వద్దకు వెళ్లి ప్రతిరోజూ రాత్రి కూరలు తెచ్చుకుంటూ ఉండేవాడు. ఈ నేపథ్యంలో గురువారం రాత్రి కూర తెచ్చుకునేందుకు వెళ్లలేదు. శుక్రవారం ఉదయం మేనత్త లక్ష్మీ జయప్రదకు అనుమానం వచ్చి విష్ణుప్రవీణ్ నివాసానికి చేరుకోగా ఆయన బాత్రూమ్‌లో నిర్జీవంగా పడి ఉన్నాడు. ఆమె మంగళగిరి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు హుటాహుటీన సంఘటనా ప్రాంతానికి చేరుకుని విష్ణు ప్రవీణ్ మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. విష్ణు ప్రవీణ్ స్నానం చేసేందుకు వెళ్లి ప్రమాదవశాత్తూ విద్యుదాఘాతానికి గురై మృతి చెందినట్లు పోలీసులు భావిస్తున్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడి

ఫిరంగిపురం: ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడి సాధించవచ్చని సత్యసాయి జిల్లా ప్రకృతి వ్యవసాయం మోడల్స్ మెంటార్ భార్గవ్ అన్నారు. మండలంలోని అమీనాబాద్ గ్రామంలో రైతు రాఘవేంద్ర పొలంలో వేసిన ప్యాడీ మోడల్‌ను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఈ పద్ధతి ద్వారా 8 అంగులాల్లో మార్కింగ్ వేసుకొని దానిని పలు వరుసలుగా విభజించి 8 అంగులాల దూరంలో మూడు నుంచి ఐదు వడ్లగింజలను చూపుడువేలు సాయంతో గుచ్చుకుంటు మట్టి చల్లాలని చెప్పారు. ఈ స్థలానికి చుట్టుపక్కల బెండ, బీర, చిక్కుడు, సొర మొక్కలు నాటుకోవాలన్నారు. కార్యక్రమంలో వీరలక్ష్మి, ఇ.వెంకటేశ్వర్లు, తిరుపతిరావు, నరసింహారావు, అన్నామణి రైతులు పాల్గొన్నారు.

ఎన్‌కాస్ గుర్తింపునకు ముస్తాబవుతున్న యూపీహెచ్‌సీలు

- ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు
- 20 నుంచి అర్బన్ హెల్త్ సెంటర్లను సందర్శించనున్న కేంద్ర బృందం



యర్రబాలెంలోని డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్

మంగళగిరి: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి చొరవతో నగరంలో నిర్మితమైన డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్లు పేదలకు వైద్య సేవలు అందించడంలో రాష్ట్రానికే ఆదర్శంగా నిలుస్తున్నాయి. దేశంలోనే ప్రథమంగా ఎన్‌కాస్ (నేషనల్ క్వాలిటీ ఎస్యూరెన్స్ స్టాండర్డ్) సర్టిఫికెట్‌ను నగరంలోని గణపతినగర్‌లోని డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్ దక్కించుకుంది. తాజాగా నగర పరిధిలోని యర్రబాలెం, డ్రైవర్స్‌పేటలోని డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్లు పేద ప్రజలకు అత్యున్నత వైద్య సేవలు అందించి ఎన్‌కాస్ గుర్తింపునకు ఆమోదం పొందాయి. ఈనెల 20వ తేదీ నుంచి 23వ తేదీ వరకు కేంద్ర వైద్య ఆరోగ్యశాఖ బృందం ఆయా అర్బన్ హెల్త్ సెంటర్లను సందర్శించి రోగులకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించనున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో సుమారు రూ.13.50 కోట్లతో నగరంలోని తొమ్మిది అర్బన్ హెల్త్ సెంటర్లను నిర్మించారు. ఆయా సెంటర్లలో ఎమ్మెల్యే ఆర్కే చొరవతో దాతలు ముందుకు వచ్చి మౌలిక వసతులు ఏర్పాటు చేశారు. అయితే ఎన్‌కాస్ గుర్తింపు పొందిన యర్రబాలెం, డ్రైవర్స్‌పేట యూపీహెచ్‌సీలకు మరికొన్ని అదనపు మౌలిక వసతులు అవసరమయ్యాయి. ఇప్పటికే దాతలు కొందరు యర్రబాలెం, డ్రైవర్స్‌పేట అర్బన్ హెల్త్ సెంటర్లకు క్యాష్‌కార్ట్, బ్రెస్ట్ ఫీడింగ్ ఛైర్, ఫిమిగేషన్ మిషన్, బేబీ వార్మర్‌తోపాటు ఫ్రిజ్‌లు, బీరువాలు అందజేశారు. మిగిలిన వసతులైన ఇన్వర్టర్స్, ఏసీ, కర్టెన్స్ ఏర్పాటు చేయాల్సి ఉంది.

మెరుగైన వైద్య సేవలు



ఎన్‌కాస్‌కు యర్రబాలెంలోని డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్ ఎంపిక కావడం సంతోషం. నగర పాలక సంస్థలో విలీనమైన పెనుమాక, యర్రబాలెం గ్రామాల్లోని ప్రజలకు యూపీహెచ్‌సీల ద్వారా ఇప్పటికే మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయి. మౌలిక వసతుల కల్పనలో భాగంగా ఇంజెక్షన్లు నిల్వ పెట్టుకునేందుకు యర్రబాలెం యూపీహెచ్‌సీకి ఫ్రిజ్‌ను అందజేయాలని వైద్య సిబ్బంది తన దృష్టికి తీసుకురావడంతో రూ. 20వేల విలువైన ఫ్రిజ్‌ను అందజేశాం.

–మేకా శివారెడ్డి, పెనుమాక

కార్పొరేట్‌కు దీటుగా..



పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు యర్రబాలెంలో నిర్మించిన డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌ను ఇటీవల సందర్శించి ఎంతో ఆశ్చర్యపోయాను. కార్పొరేట్ వైద్యశాలలకు దీటుగా నిర్మించిన యూపీహెచ్‌కి తన వంతు సహాయంగా ఏదైనా సహాయం చేయాలని నిర్ణయించుకున్నాను. అందులో భాగంగా ఎక్స్‌రే మిషన్ అందజేశాను.

–వాసు, యర్రబాలెం

సంతోషంగా ఉంది



యూపీహెచ్‌సీలో పేద ప్రజలకు, గర్భిణులు, చిన్నపిల్లలకు మెరుగైన వైద్య సేవలు ఉచితంగా అందించడం ఎంతో సంతోషంగా ఉంది. ఎన్‌కాస్ గుర్తింపు పొందినట్లయితే భవిష్యత్తులో కార్పొరేట్ తరహాలో ఉచిత వైద్య సేవలు పేదలకు అందించే అవకాశం ఉంటుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతోపాటు ఎమ్మెల్యే ఆర్కే చొరవతో దాతల సహకారంతో ఇప్పటికే కొన్ని మౌలిక వసతులు ఏర్పాటు చేయగా మరికొన్ని వసతులు కల్పించాల్సి ఉంది.

–డాక్టర్ రాజేష్, వైద్యాధికారి, యర్రబాలెం

రహదారి పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

- ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే)
- అర్ధరాత్రి పనుల పరిశీలన



బీటీ రహదారి నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆర్కే

మంగళగిరి: కార్పొరేషన్ పరిధిలో కోట్లాది రూపాయల నిధులతో చేపట్టిన పలు బీటీ, సీసీ రహదారుల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) అన్నారు. గురువారం అర్ధరాత్రి నగరపాలక సంస్థ అధికారులతో కలసి ఆయన నగరంలోని అల్పా హోటల్ ఎదుట శ్రీబాలాజీ అపార్ట్‌మెంట్స్ సమీపంలో నిర్మాణం చేపట్టిన బీటీ రహదారి పనులను ఎమ్మెల్యే ఆర్కే పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కార్పొరేషన్ పరిధిలో ఇప్పటికే పలు బీటీ, సీసీ రహదారుల నిర్మాణ పనులను పూర్తి చేశామని, మరికొన్ని రహదారుల నిర్మాణాలు కొనసాగుతున్నాయని తెలిపారు. నగరంలోని అల్పా హోటల్ సమీపంలో సుమారు రూ.35 లక్షల నిధులతో 360 మీటర్ల పొడవుతో బీటీ రహదారి నిర్మాణాన్ని చేపట్టామన్నారు. ప్రజలకు మౌలిక వసతులను కల్పించడమే తన ధ్యేయమని, అందులో భాగంగా రహదారులు, డ్రైనేజి నిర్మాణాలతో పాటు తాగునీటి వసతి వంటి సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. నగరపాలక సంస్థ డీఈ కృష్ణారెడ్డి తదితరులు బీటీ రోడ్డు నిర్మాణాన్ని పరిశీలించిన వారిలో ఉన్నారు.

తురకపాలెం వాసుల సమస్యల పరిష్కారానికి కృషి

మేడికొండూరు: మండల పరిధిలోని డోగిపర్రు గ్రామ పంచాయతీ పరిధిలోని తురకపాలెం కొన్ని సంవత్సరాలుగా పేరుకుపోయిన సమస్యలను రెండు నెలలుగా పరిష్కరించే దిశగా కృషి చేస్తున్నట్లు జెడ్పీటీసీ సభ్యుడు కందుల సిద్ధయ్య అన్నారు. ఇప్పటికే కాలనీలో పలు సీసీ రోడ్లు, గ్రావెల్, మంచినీటి సమస్య పరిష్కరించారు. ఎన్నో ఏళ్లుగా అపరిశుభ్రంగా ఉన్న కొండవీటి వాగు పూడిక తీయడం జరిగిందన్నారు. మరికొన్ని సమస్యలు ప్రజలు జెడ్పీటీసీ దృష్టికి తీసుకెళ్లారు. సర్పంచ్ సాంబ్రాజ్యం, కోటేశ్వరరావు, ఉపసర్పంచ్ షేక్ హసన్‌లతో కలసి గ్రామంలో పర్యటించారు. ప్రధానంగా జోసిల్ కంపెనీ రసాయనాలతో వాటర్ కలుషితం అవుతుందని, దీన్ని పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామంలో విద్యుత్ సమస్యపై అధికారులతో మాట్లాడి త్వరలో పరిష్కరిస్తామన్నారు. ప్రజలందరూ తమ సమస్య పరిష్కారానికి ప్రాధాన్యత ఇచ్చినందుకు జెడ్పీటీసీ, సర్పంచ్, ఉపసర్పంచ్‌లకు మహిళలు, ప్రజలు ధన్యావాదాలు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రమేష్, వలంటీర్లు, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఫార్మసీ పట్టాలు పంపిణీ



డిగ్రీ పట్టాలు అందజేస్తున్న రాష్ట్ర ఫార్మసీ కౌన్సిల్ రిజిస్ట్రార్ డాక్టర్ విలియం క్యారీ

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని సెయింట్ జేవియర్ ఫార్మసీ కళాశాల ఆధ్వర్యంలో శుక్రవారం దీనాపూర్ కళాశాల డాక్టర్ అంబేడ్కర్ ప్రాంగణంలో ఫార్మసీ విద్యార్థులకు డిగ్రీ పట్టాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. 50 మంది ఉత్తీర్ణులైన విద్యార్థులకు రాష్ట్ర ఫార్మసీ కౌన్సిల్ రిజిస్ట్రార్ డాక్టర్ విలియం క్యారీ, కార్డ్స్ సంస్థ డైరెక్టర్ స్వర్ణలతదేవి పట్టాలు అందజేశారు. డాక్టర్ విలియం క్యారీ మాట్లాడుతూ ఫార్మసీ రంగంలో ప్రస్తుతం మంచి అవకాశాలు ఉన్నాయని చెప్పారు. ఈ రంగం ద్వారా సమాజసేవ చేసేందుకు విద్యార్థులు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏసుపాదం, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఫార్మా ఐటీ సెక్టార్‌పై అంతర్జాతీయ సదస్సు



సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న ఫార్మసీ విద్యార్థులు

మంగళగిరి: కార్పొరేషన్ పరిధిలోని ఆత్మకూరు నిర్మలా ఫార్మసీ కళాశాలలో ఫార్మా ఐటీ సెక్టార్‌పై శుక్రవారం అంతర్జాతీయ సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ రెహమాన్ మాట్లాడుతూ ఒపెరెంట్ ఫార్మసీ ఫెడరేషన్ (ఓపీఎఫ్), నిర్మలా ఫార్మసీ కళాశాల భాగస్వామ్యంతో ఈ అంతర్జాతీయ సదస్సు నిర్వహించామన్నారు. ఫార్మసీకి సంబంధించిన వివిధ విభాగాల్లో సైంటిఫిక్ సెషన్స్, ఓరల్ ప్రజెంటేషన్స్, డిబేట్, ఫార్మా చరాడ్స్, గాత్ర, నృత్య పోటీలు నిర్వహించామని, విజేతలకు శనివారం బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తులసీ ఆసుపత్రి ఛైర్మన్ డాక్టర్ ఉమాశంకర్, నిర్మా యూనివర్సిటీ అహ్మదాబాద్ ఫార్మసీ డైరెక్టర్ డాక్టర్ గోపాల్ నటేశన్, డాక్టర్ కళిరాజన్, జెఎస్ఎస్ ఊటీ, డాక్టర్ ప్రదీప్‌కుమార్, డాక్టర్ లక్ష్మణరావు, విక్రమ్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రతి కుటుంబానికి భరోసా

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్



నిడుముక్కలలో వృద్ధులతో మాట్లాడుతున్న కత్తెర సురేష్‌కుమార్

నిడుముక్కల(తాడికొండ): జగనన్న ఆరోగ్య సురక్షా పథకం ద్వారా రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి ఆరోగ్య భరోసా కల్పిస్తున్న ప్రభుత్వం పట్ల ప్రజలు సంతృప్తితో ఉన్నారని వైఎస్సార్‌సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ అన్నారు. తాడికొండ మండలం నిడుముక్కల, తుళ్ళూరు మండలం వెంకటపాలెం గ్రామాల్లో జగన్న ఆరోగ్య సురక్షా కార్యక్రమాన్ని సందర్శించిన ఆయన పలువురు వృద్ధులు, పథకం వినియోగిస్తున్న వారిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. వైద్య సదుపాయాలు సరైన సమయంలో అందుతున్నాయా లేదా, ఎవరికైనా ఆరోగ్య సమస్యలు ఉన్నాయా ఉంటే వైద్య సదుపాయాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ప్రతి నెలా వైద్యాధికారులు క్యాంపులు నిర్వహిస్తున్నారా లేదా అని ఆరాతీసి వైద్య క్యాంపులు నిర్వహించే సమయంలో గ్రామంలో అందరికీ తెలిసేలా ప్రచారం చేయాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ మాదాసు రత్నకుమారి, మాజీ ఎంపీపీ బండ్ల పున్నారావు, ఎంపీటీసీ బోడపాటి సుశీల, మండల పార్టీ అధ్యక్షుడు బొర్రా వెంకటేశ్వరరెడ్డి, ఎంపీడీవో అత్తోట దీప్తి, తహసీల్దార్ జీవీఎస్ ఫణీంద్రబాబు పలువురు వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

కుట్టు శిక్షణతో మహిళలు ఆర్థికంగా రాణించాలి

విజ్ఞాన కేంద్రాల రాష్ట్ర కన్వీనర్ పిన్నమనేని మురళీకృష్ణ

తాడేపల్లిరూరల్: కుట్టు శిక్షణ నేర్చుకోవడం ద్వారా మహిళలు ఆర్థికంగా రాణించాలని విజ్ఞాన కేంద్రాల రాష్ట్ర కన్వీనర్ పిన్నమనేని మురళీకృష్ణ అన్నారు. శుక్రవారం తాడేపల్లి మేకా అమరారెడ్డి భవన్‌లో మంగళగిరి తాడేపల్లి బాలోత్సవం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహిళా నైపుణ్య శిక్షణ కేంద్రాన్ని కాన్ఫెడరేషన్ ఆఫ్ అపార్ట్‌మెంట్స్ అసోసియేషన్ తాడేపల్లి అధ్యక్షులు జీఎస్ఆర్ మోహనరావు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ నిత్యావసర ధరలు పెరిగిన నేపథ్యంలో భార్యాభర్తలు ఇద్దరూ పనిచేస్తేనే కుటుంబాలు గడిచే పరిస్థితి ఏర్పడిందని అన్నారు. అందుకు కుట్టు మిషన్ శిక్షణ తోడ్పడుతుందని తెలిపారు. మహిళలు అనేక విధాలుగా తమ నైపుణ్యాలను ప్రదర్శించడానికి శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయాలని అడుగుతున్నారని అన్నారు. విజయవాడ మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని అన్నారు. పిన్నమనేని విజయ మాట్లాడుతూ మహిళలకు సంబంధించిన అనేక రకాల డిజైన్లను రూపొందించుకుని ముందుకు సాగుతున్న అనుభవాన్ని వివరించారు. శిక్షణ విజయవంతం కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంబీవీకే విజయవాడ బాధ్యులు పి.వి జయ, మాజీ సర్పంచ్ దొంతిరెడ్డి శ్రీనివాసకుమారి, మంగళగిరి తాడేపల్లి బాలోత్సవం కార్యదర్శి శ్రీలక్ష్మి, కుట్టు శిక్షకులు ఎస్‌కె నాగుర్‌బి, కేంద్ర నిర్వాహకులు చింతా వెంకటరత్నం, నైపుణ్య శిక్షణ కేంద్రం నిర్వాహకులు గాదె సుబ్బారెడ్డి, సుందరయ్యనగర్ ఎంకెఆర్ ట్రస్ట్ నిర్వాహకులు కొట్టె కరుణాకరరావు, దుర్గి కోదండరామయ్య, బిట్రా రామారావు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతకు, మన్నికకు భారతీ సిమెంట్

తాడికొండ: భవన నిర్మాణాలు శాశ్వతమైనవని, వాటి నిర్మాణం కోసం సాంకేతిక పరి/-నాన్ని ఉపయోగించి తయారు చేయబడిన నాణ్యమైన సిమెంటును ఎంచుకోవాలని భారతి సిమెంట్స్ అసిస్టెంట్ మేనేజర్(మార్కెటింగ్) పూల సురేష్, సీనియర్ టెక్నికల్ ఆఫీసర్ ఎస్ భవానీశంకర్‌లు సూచించారు. తుళ్లూరులో శుక్రవారం రాత్రి సింహాద్రీ స్టీల్స్, శ్రీ శ్రావ్యలక్ష్మి సిమెంట్స్ సహకారంతో భారతి సిమెంట్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో భవన నిర్మాణ మేస్త్రీలు, కార్మికులకు అవగాహనా సదస్సును నిర్వహించారు. సదస్సుకు హాజరైన మేస్త్రీలు, కార్మికులకు రూ.లక్ష చొప్పున ఉచిత బీమా సదుపాయం కల్పించి బాండ్లను అందజేశారు. కార్యక్రమంలో సింహాద్రి స్టీల్స్ యజమాని కె నాగేశ్వరరావు, శ్రీ శ్రావ్యలక్ష్మి సిమెంట్స్ యజమాని ఎస్ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

క్రీడాకారుల ఎంపిక

ఫిరంగిపురం: పొనుగుపాడు జెడ్పీ పాఠశాలలో రెండు రోజులుగా మండల స్థాయి అండర్ 14, 17 క్రీడాపోటీలు నిర్వహించినట్లు పాఠశాల హెచ్‌ఎం సాంబశివరావు శుక్రవారం తెలిపారు. కబడ్డీ, ఖోఖో, బాల్ బ్యాడ్మింటన్, యోగా, అథ్లెటిక్స్, షటిల్ పోటీలు నిర్వహించామన్నారు. పోటీలకు మునగపాడు, నుదురుపాడు, బేతపూడి, అమీనాబాద్, అల్లంవారిపాలెం జెడ్పీపాఠశాల, సెయింట్‌పాల్స్, సెయింట్ ఆన్స్ బాలికల పాఠశాల క్రీడాకారులు పాల్గొన్నారని చెప్పారు. మొత్తం 220 మంది క్రీడాకారులు పాల్గొనగా వారిలో 120మంది ఎంపికచేసినట్లు వివరించారు. త్వరలో నియోజకవర్గస్థాయిలో నిర్వహించే పోటీల్లో వీరు పాల్గొంటారని చెప్పారు. ఆయన వెంట పీడీ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్‌పై అవగాహన అవసరం

తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరంలో ఉన్న కేఎల్ విశ్వవిద్యాలయం ఈసీఈ ఔత్సాహిక పాఠశాల విద్యార్థుల కోసం ఇంట్రడక్షన్ టు ఎలక్ట్రానిక్స్ కార్యక్రమాన్ని పెదవడ్లపూడిలోని విజేత హైస్కూల్ నందు శుక్రవారం నిర్వహించారు. ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ ఎం.సుమన్ మాట్లాడుతూ విద్యార్థులకు ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ పట్ల అవగాహన అవసరమని అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సిహెచ్ శ్రీకావ్య, టీమ్ పల్స్ సలహాదారు, టీమ్ పల్స్ ఇన్‌చార్జి పి. శ్రీకాంత్‌రెడ్డిలు తమ సందేశాలను అందజేశారు. అవగాహన కార్యక్రమం నిర్వహించిన వారిని వర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రొ వైస్ చాన్సలర్లు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, ఎన్.వెంకటరామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె. సుబ్బారావులు అభినందించారు.

ఘనంగా ఇంజినీరింగ్ డే వేడుకలు



విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యురాలు

మేడికొండూరు: మండల పరిధిలోని డోగిపర్రు పరిధిలోని యూనివర్సల్ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం ఇంజినీరింగ్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ ఫాదర్ మర్రెడ్డి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఇంజినీరింగ్ విభాగం ఎంచుకున్న ప్రతి విద్యార్థి వారి శక్తి సామర్థ్యాన్ని ఉపయోగించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. ఇంజినీరింగ్ చదివే ప్రతి విద్యార్థి వారి కలల సాకారం చేసుకునేందుకు మొదటి నుంచి కష్టపడి చదవాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ ఫాదర్ సీహెచ్.కిషోర్‌బాబు, ప్రిన్సిపల్ సీహెచ్.కేశవరెడ్డి, ఎం.జయరామరెడ్డి, పలు విభాగాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల ప్రజాపరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం ఇంజినీరింగ్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన దుగ్గిరాల ఎంపీపీ దానబోయిన సంతోషరూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి అరుణలు ఇంజినీరింగ్ సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం భారతరత్న, దివంగత మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎంపీపీ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో ప్రకాశం జిల్లాలో పుట్టిన మోక్షగుండం విశ్వేశ్వరయ్య తండ్రి చనిపోవడంతో కర్నాటక వెళ్లి చదువుకున్నారని, భారతదేశంలోని చాలా ప్రాజెక్టులు ఆయన డిజైన్ చేసినవేనని, తిరుపతి ఘాట్ రోడ్‌తోపాటు హైదరాబాద్‌లో మురుగునీటి సమస్యను పరిష్కరించిన మహావ్యక్తి అని, ఆయన పుట్టిన రోజును ఇంజినీరింగ్ డేగా జరుపుకుంటామని అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కుసుమ శ్రీదేవి, హౌసింగ్ డీఈ రామ్మోహనరావు, ఆర్ అండ్ బీ జేఈ భాస్కరరావు, పంచాయతీరాజ్ ఏఈ రమేష్‌రెడ్డి, హౌసింగ్ ఏఈ ఎండీ షా, దుగ్గిరాల మండల పరిధిలోని సచివాలయ ఇంజినీరింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మోతడక(తాడికొండ): ఇంజినీర్స్ డే ను పురస్కరించుకొని మోతడక చలపతి ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన వేడుకలకు బీఎస్ఎన్ఎల్ సబ్ డివిజనల్ ఇంజినీర్ టి సీతారామ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. క్విజ్, పోస్టర్ ప్రజెంటేషన్, వ్యాసరచన, ప్రాజెక్ట్ ఎక్స్పో, కోడింగ్ టెస్ట్, టెక్ ట్విస్ట్ వంటి పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ కె కిరణ్ కుమార్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కె నాగ శ్రీనివాసరావు, డిప్లొమా ప్రిన్సిపల్ డాక్టర్ జె జయకృష్ణ, పలు విభాగాధిపతులు, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

తాడేపల్లిలో విజయవాడ పోలీసుల ఛేజింగ్

తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని పోలకంపాడు పాత జాతీయ రహదారి వెంబడి శుక్రవారం విజయవాడ పోలీసులు ఓ ఆటోలో నక్కి ఉన్న యువకుడ్ని పట్టుకునేందుకు శుక్రవారం రాత్రి ప్రయత్నం చేశారు. ఆ యువకుడు పోలీసులు రాగానే తన పెంపుడు కుక్కను పోలీసుల మీదకు వదలడంతో ఒక్కసారిగా ఆ కుక్క పోలీసుల మీదకు దూకింది. ఎలాగోలా కుక్క బారినుండి తప్పించుకున్నారు. అంతలో ఆటోలో ఉన్న యువకుడు ఆటో దిగి పోలకంపాడు ఓపెన్ థియేటర్ వద్ద ఉన్న ముళ్లపొదల్లోకి పరుగులు తీశాడు. పోలీసులు సైతం లెక్కచేయకుండా ముళ్ల పొదల్లో నక్కి ఉన్న యువకుడ్ని వెతికి పట్టుకుని ఆటోలో విజయవాడకు తరలించారు. పోలీసులకు వివరణ కోరగా వారు విషయాలు చెప్పడానికి నిరాకరించారు.

ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా ఓటరు నమోదు ప్రక్రియ



తాడికొండ: ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా ఓటర్ల మార్పులు, చేర్పులు, సవరణలు చేయాలని నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తప్పవని తాడికొండ నియోజకవర్గ ఎన్నికల నిర్వహణాధికారి, కేఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం వెంకట శివరామిరెడ్డి అన్నారు. శుక్రవారం తాడికొండ తహసీల్దార్ కార్యాలయంలో 4 మండలాల తహసీల్దార్‌లు రాజకీయ పార్టీల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఎన్నికల ఏడాది నేపథ్యంలో పక్కాగా ఓటర్ల మార్పులు చేర్పులు ఉండాలని, ప్రజల నుంచి వచ్చే అన్ని అభ్యంతరాలను స్వీకరించి పరిష్కరించాలని సూచించారు. నియోజకవర్గంలో నాడు–నేడు ద్వారా పాఠశాల భవనాల నిర్మాణంలో వచ్చిన మార్పుల కారణంగా 17 పోలింగ్ బూత్‌లను ప్రాథమికంగా మార్పుకు ప్రతిపాదనలు పంపించేందుకు సిద్ధం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో 4 మండలాల తహసీల్దార్‌లు, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఆటల ద్వారా విద్యార్థుల్లో ప్రతిభను గుర్తిస్తాం

తెనాలి డిప్యూటీ డీఈఓ ఎం.నిర్మల



మండలస్థాయి ఆటల పోటీలను ప్రారంభిస్తున్న తెనాలి డిప్యూటీ డీఈఓ ఎం.నిర్మల

తాడేపల్లిరూరల్: గ్రామ స్థాయి నుంచి విద్యార్థుల్లో ఆటలపై ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ప్రతి ప్రభుత్వ పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మండల స్థాయిలో ఆటల పోటీలు నిర్వహించామని తెనాలి డిప్యూటి డీఈఓ ఎం.నిర్మల అన్నారు. రేవేంద్రపాడు జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్వహిస్తున్న పోటీలు శుక్రవారంతో ముగిశాయి. ఆమె మాట్లాడుతూ విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లో కూడా చురుకుగా పాల్గొనాలని, ఆరోగ్యంతోపాటు తమలో ఉన్న ప్రతిభ బయట పడుతుందని, గెలిచిన వారు మరింత ముందుకు వెళుతూ, ఓడిపోయిన వారు నిరుత్సాహపడకుండా మరల గెలిచే విధంగా ప్రయత్నం చేయాలని సూచించారు. దుగ్గిరాల మండల పరిధిలోని ఏడు జిల్లా పరిషత్ పాఠశాలలు, రెండు ప్రైవేటు పాఠశాలల నుంచి సుమారు 120 మంది విద్యార్థులు హాజరయ్యారు. అండర్ 17 బాలుర విభాగంలో జడ్పిహెచ్ఎస్ దుగ్గిరాల బాయ్స్ విన్నర్‌గాను, జడ్పిహెచ్ఎస్ ఈమని బాలురు రన్నర్‌గా నిలిచారు. అండర్ 14 బాలుర విభాగంలో జడ్పిహెచ్ఎస్ దుగ్గిరాల విన్నర్‌గాను, అండర్ 14 బాలికల విభాగంలో సెయింట్ జోసఫ్ ఈమని విన్నర్‌గాను, జడ్పిహెచ్ఎస్ రేవేంద్రపాడు రన్నర్‌గాను నిలిచారు. అండర్ 17 బాలికల విభాగంలో ఈమని జడ్పిహెచ్ఎస్ బాలికలు విన్నర్‌గాను, సెయింట్ అలోన్స చిలువూరు బాలికలు రన్నర్‌గాను నిలిచారు. బాల్‌బాడ్మింటన్ అండర్ 17 బాలుర విభాగంలో జడ్పిహెచ్ఎస్ ఈమని విన్నర్‌గాను, రేవేంద్రపాడు రన్నర్‌గా,బాలికల విభాగంలో దుగ్గిరాల బాలికలు విన్నర్‌గా, రేవేంద్రపాడు రన్నర్‌గా నిలిచారు. ఈ కార్యక్రమంలో బుర్రిపాలెం ప్రధానోపాధ్యాయులు లలిత ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పెనుమాకలో ముగిసిన ఆటల పోటీలు

తాడేపల్లి రూరల్ పెనుమాక ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన ఆటల పోటీలు ముగిశాయి. ఆ ఆటల పోటీలలో తాడేపల్లి రూరల్ పరిధిలోని జిల్లా పరిషత్ పాఠశాలలో చదువుతున్న అండర్ 14, అండర్ 17 విభాగంలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, త్రోబాల్ ఆటల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారిని నియోజకవర్గ స్థాయి ఆటల పోటీలకు పంపనున్నారు. కార్యక్రమంలో తాడేపల్లి మండల పరిధిలోని పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, పి.ఇ.టి.లు, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.